అరుంధతి ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

దుండిగల్, మే 16 (ఆంధ్రజ్యోతి): అరుంధతి ఆస్పత్రిలో గుండెకు అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్లకు చెందిన కె. బ్లెస్సీ డిబోరా(22) అనే మహిళ గుండె మామూలుకన్నా మూడురెట్లు వేగంగా కొట్టుకుంటుంది. ఆమెను కుటుంబ సభ్యులు దుండిగల్‌లో అరుంధతి ఆస్పత్రికి తీసుకొచ్చారు. డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో వైద్య బృందం గుండె వేగాన్ని తగ్గించే వైద్య ప్రక్రియను ఉపయోగించి విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ఆస్పత్రి యాజమాన్యం ఉచితంగా శస్త్రచికిత్స చేసిందని బ్లెస్సీ కుటుంబ సభ్యులు తెలిపారు. డాక్టర్ ఉదయ్‌కుమార్ వైద్య బృందాన్ని ఆస్పత్రి ఫౌండర్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్ ధీరేన్‌రెడ్డి అభినందించారు.

జేఎన్‌టీయూ అసోసియేట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



డాక్టర్ దేవేందర్

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీ మెకానికల్ విభాగంలో సహాయ ఆచార్యుడిగా పనిచేస్తున్న జి.దేవేందర్‌కు పీహెచ్‌డీ ప్రదానం చేస్తూ యూనివర్సిటీ పరీక్షల విభాగం డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. 'ఆప్టిమైజేషన్ ఆఫ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్.. పారామీటర్స్ ఆఫ్ సిలిండ్రికల్ కప్ యూజింగ్ నికెల్ అల్లాయిడ్స్ బై డీప్ డ్రాయింగ్' అంశంపై దేవేందర్ డాక్టరేట్ పొందారు. మెకానికల్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ చెన్నకేశవరెడ్డి గైడ్‌గా వ్యవహరించారు. డాక్టర్ దేవేందర్ మాట్లాడుతూ.. పరిమితి రేఖా చిత్రాలను రూపొందించడం, షీట్ మెటల్ ప్రవర్తనను అంచనా వేయడానికి, ఉత్పత్తి రంగంలో తన పరిశోధన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. న్యూక్లియర్ ఇంజనీరింగ్ రేడియేషన్ వాతావరణంలో అద్భుతమైన ప్రతిఘటన కారకంగా, ఉష్ణ నిరోధకాల తయారీకి ఉపయోగపడుతుందని తెలిపారు. దేవేందర్ స్వస్థలం రాజన్న సిరిసిల్ల జిల్లా, కొండాపూర్ గ్రామం. ఆయనకు పలువురు ఆచార్యులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.



జాతీయ త్రోబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామన్ సాహ్నికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సత్యం శ్రీరంగం

త్రోబాల్ చాంపియన్ షిప్
ఆర్గనైజింగ్ చైర్మన్‌గా సత్యం శ్రీరంగం

బాలానగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జూన్ మొదటి వారం జరగబోయే 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్ షిప్ పోటీలకు ఆర్గనైజింగ్ చైర్మన్‌గా టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం నియమితులయ్యారు. జాతీయ త్రోబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామన్ సాహ్ని సత్యంను గురువారం ఆయన నివాసంలో కలిసి నియామకపత్రం అందజేశారు. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ.. చాంపియన్‌షిప్ పోటీలు సజావుగా జరిగేలా తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కృష్ణరాజ్‌పుత్, కోశాధికారి జమీల్ పాల్గొన్నారు.



భగేష్‌ను అభినందిస్తున్న సురేష్‌రెడ్డి

యోగాసనంలో రికార్డు సాధించిన విద్యార్థికి అభినందనలు

జీడిమెట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): యోగాసనంలో ప్రపంచ రికార్డు సాధించిన సూరారంకాలనీకి చెందిన భగేష్ అనే విద్యార్థిని మాజీ కార్పొరేటర్ జి.సురేష్‌రెడ్డి అభినందించారు. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో వరల్డ్ రికార్డు ఆఫ్ ఎక్స్‌లెన్సీ సర్టిఫికెట్ పొందాడు. రెండు నిమిషాల యాభై సెకండ్లు యోగాసనం చేసినందుకు ఈ సర్టిఫికెట్ సాధించాడు.

పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రాయదుర్గం, మే 16 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజేంద్రనగర్ స్పెషల్ పోక్సో కోర్టు గురువారం తీర్పు చెప్పింది. నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన కట్ల సతీష్ అలియాస్ సతీష్‌కుమార్‌రెడ్డి(23) గొలిదొడ్డి గ్రామంలో బాలికపై 2017లో అత్యాచారం చేశాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.

కేసును విచారించిన రాజేంద్రనగర్ స్పెషల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి నిందితుడు సతీష్‌కుమార్‌రెడ్డికి పదేళ్ల జైలు శిక్ష, రూ. 8 వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ. 5 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించారు.

రైలు నుంచి జారిపడి మేస్త్రీ మృతి

బర్కత్‌పుర, మే 16 (ఆంధ్రజ్యోతి): రైల్లో నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్లలో నివసిస్తున్న ఎ. రమేష్(45) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. గురువారం షాద్‌నగర్ నుంచి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు హంద్రీనీవా ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తున్నాడు. రైలు బోగీ డోర్ వద్ద నిలబడిన అతడు బుద్వేల్-ఉందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొంపల్లిలో మళ్లీ రెచ్చిపోయిన వీధికుక్కలు

● అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో నిలబడిన మహిళపై దాడి





గాయపడిన మహిళ, కాలికి గాయాలు

పేట్‌బషీరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి మునిసిపాలిటీ వీధికుక్కలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇటీవల తల్లీకూతుళ్లపై వీధి కుక్కలు దాడిచేసి గాయపరిచిన ఘటన మరవక ముందే.. గురువారం నార్త్ ఎన్‌సీఎల్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో నిలబడిన సరిత (31)పై వీధికుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నారే తప్ప వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంపల్లి మున్సిపాలిటీలో వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఈ మేరకు మునిసిపల్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కవాడిగూడ, మే 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గాంధీనగర్ సీఐ డి. రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బన్సీలాల్‌పేట సీసీనగర్‌లో నివసిస్తున్న డి. చంద్రశేఖర్(21) హమాలీగా పనిచేస్తున్నాడు. అన్నదమ్ముల మధ్య జరుగుతున్న కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెందిన చంద్రశేఖర్ సమీపంలో ఉన్న పెద్దమ్మ ఇంటికి వెళ్లి బుధవారం రాత్రి తాడుతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి సోదరి రేఖ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





కుత్బుల్లాపూర్ వాజ్‌పేయినగర్‌లో ఇళ్లలోకి చేరిన వర్షంనీరు



కేపీహెచ్‌బీ మూడో ఫేజ్ ఎల్ఐజీలో విద్యుత్ తీగలపై విరిగి పడిన చెట్ల కొమ్మలు

దంచికొట్టిన వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- చెరువులను తలపించిన రోడ్లు
- వాహనదారుల ఇబ్బంది
- కుత్బుల్లాపూర్‌లో ఇళ్లలోకి నీరు

కూకట్‌పల్లి/శేరిలింగంపల్లి/కుత్బుల్లాపూర్ జోన్‌బృందం (ఆంధ్రజ్యోతి): గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో రోడ్లు చెరువులను తలపించాయి. ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. కేపీహెచ్‌బీ మూడో ఫేజ్ ఎల్ఐజీ ఫ్లాట్స్ ప్రాంతంలో చెట్లకొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కుత్బుల్లాపూర్ పద్మానగర్, ఫేజ్-2, వాజ్‌పేయినగర్‌లో మ్యాన్‌హోల్స్ పొంగి వర్షపు నీటితో కలిసి మురుగునీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



గాజులరామారం రామ్‌కీ అపార్ట్‌మెంట్ల వద్ద రోడ్డుపై వరద నీరు



కేపీహెచ్‌బీ మూడో ఫేజ్‌లో పిల్లల పార్కులో నిలిచిన వరద నీరు



కుత్బుల్లాపూర్‌లో అంతర్గత రోడ్లలో పారుతున్న వర్షపు నీరు



కూకట్‌పల్లిలో జాతీయరహదారిపై వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్



కుత్బుల్లాపూర్ ప్రసూననగర్‌లో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు



బాలానగర్‌లో..



బాలానగర్ సమతానగర్‌లో రోడ్డుపై వరద నీరు

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

భెల్‌కాలనీ, మే 16 (ఆంధ్రజ్యోతి): భెల్ టౌన్‌షిప్‌లోగల వేంకటేశ్వర, యోగేశ్వరస్వామి దేవస్థానంలో 56వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం నిత్యహోమం, శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ప్రత్యేక మూల మంత్ర హోమం, వేంకటేశ్వర స్వామి మూల విగ్రహానికి 108 లీటర్లతో క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, గంధాభిషేకం తదితర అభిషేకాలు జరిగాయి. స్వామివారి దివ్య మూర్తులకు బంగారు తిరునామం, బంగారు హస్త అలంకరణలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుప్పావడై సేవ, 50 కేజీల పులిహోర, పది రకాల ప్రసాదాలతో నైవేద్యాన్ని సమర్పించారు.

యాగశాలలో మహాసుదర్శన హోమం, సుందరకాండ హోమం జరిగాయి. సుగంధ పుష్పాలతో అలంకరించిన వాహనంపై స్వామి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి దేవాలయంలో ఊరేగించారు. దశావతార మండపంలో ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో శ్రీనివాసుడి కల్యాణం కనులపండువగా జరిగింది. కార్యక్రమంలో ప్రధానార్చకుడు రామకృష్ణమాచార్యులు, ఆలయ కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి విగ్రహానికి గంధాభిషేకం చేస్తున్న దృశ్యం



స్వామివారికి సమర్పించిన మహాఅన్నాభిషేకం

భిన్నత్వంలో ఏకత్వమే కుటుంబం

● డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

కవాడిగూడ, మే 16 (ఆంధ్రజ్యోతి): భిన్నత్వంలో ఏకత్వమే కుటుంబమని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, కృష్ణవేణి అన్నారు. అంతార్జాతీయ కుటుంబాల దినోత్సవం సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణమఠంలో యోగానంద రఘుమహరాజు, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలల సేవా విభాగంలో కుటుంబాలు- వాతావరణ మార్పులు అనే అంశంపై డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి గురువారం బహుమతులు, రంగు పెన్సిల్స్, ఫ్రీడంఫైటర్స్, దేశ భక్తి గీతాల పుస్తకాలు అందజేసినట్లు హిప్నో పద్మాకమలాకర్, కృష్ణవేణి తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని బంధాలను సమన్వయం చేసుకొని అందరితో కలివిడిగా ఉంటూ గౌరవ మర్యాదలు ఇచ్చిపుచ్చుకోవాలని అన్నారు. ఎక్కడ తగ్గాలో తెలుసుకుంటే బంధాలు కలకాలం నిలుసుస్తాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

భర్తను చంపి గుండెపోటుగా చిత్రీకరించిన భార్య

● నలుగురు నిందితులకు రిమాండ్

యూసుఫ్‌గూడ, మే 16 (ఆంధ్రజ్యోతి): భర్తను చంపి గుండెపోటుగా చిత్రీకరించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎల్లారెడ్డిగూడలో శ్రీలక్ష్మి, విజయ్‌కుమార్ దంపతులు నివసిస్తున్నారు. శ్రీలక్ష్మి మరో వ్యక్తితో చనువుగా ఉండడం గమనించిన విజయ్‌కుమార్ ఆమెను మందలించాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 1వ తేదీన శ్రీలక్ష్మి తనకు తెలిసిన పటోళ్ల రాజేశ్వర్‌రెడ్డి, రాజేష్, బాబన్ అలియాస్ మహమ్మద్ ఫైతాబ్‌లతో కలిసి పథకం ప్రకారం విజయ్‌కుమార్‌పై దాడి చేశారు. అతడిని తీవ్రంగా కొట్టడంతో మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని బాత్‌రూమ్‌లో పడేశారు. చుట్టుపక్కల వారు, బంధువులకు తన భర్త గుండెపోటుతో మృతి చెందాడని నమ్మించి దహన సంస్కారాలు కూడా పూర్తి చేసింది. అప్పటి నుంచి రాజేశ్వర్‌రెడ్డికి నిద్ర పట్టడం లేదు. పోలీసులకు చెబితే కొడతారని భయపడి వికారాబాద్ పారిపోయాడు. తిరిగి నగరానికి వచ్చి ఖైరతాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అనిల్‌కుమార్‌కు శ్రీలక్ష్మి, మరో ముగ్గురం కలిసి విజయ్‌కుమార్‌ను హత్య చేశామని చెప్పాడు. అతడి స్టేట్‌మెంట్ తీసుకున్న అనిల్‌కుమార్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.



రెండు ముక్కలైన బైక్



ధ్వంసమైన కారు

ట్యాంక్‌బండ్‌పై ప్రమాదం

● బైక్‌ను ఢీకొట్టిన కారు.. యువకుడి మృతి

కవాడిగూడ, మే 16 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్‌బండ్‌పై వేగంగా వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. దోమలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్‌కు చెందిన ఎం.కార్తీక్(21) కర్మన్‌ఘాట్‌లో నివసిస్తూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి కార్తీక్ పల్సర్ బైక్‌పై యూసుఫ్‌గూడ నుంచి అంబర్‌పేట వెళ్తున్నాడు. ట్యాంక్‌బండ్‌పై సికింద్రాబాద్ వైపు నుంచి వస్తున్న కారు ఐస్‌క్రీమ్ పార్లర్ వద్ద కార్తీక్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. బైక్ వెనుక కూర్చు మధు అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీలో అడ్మిషన్లు

● జూన్ 10 నుంచి 15 వరకు ర్యాలీ

అల్వాల్, మే 16 (ఆంధ్రజ్యోతి): బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ(బీఎస్‌సీ) మద్రాస్ రెజిమెంటల్ సెంటర్ స్పోర్ట్స్ అథ్లెటిక్స్ క్యాడెట్స్‌ను చేర్చుకునేందుకు జూన్ 10 నుంచి 15వ తేదీ వరకు మద్రాస్ రెజిమెంటల్ సెంటర్ వెల్లింగ్టన్(నీలగిరి)లో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రక్షణశాఖ పౌరసంబంధాల అధికారి శివహరినాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్‌సీ అనేది స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆర్మీ మధ్య జాయింట్ వెంచర్. భవిష్యత్‌లో నిర్వహించే అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పతకాలను గెలుచుకోవడానికి ర్యాలీలో ఎంపిక చేసిన క్యాడెట్స్‌ను తీర్చిదిద్దుతారు. క్రీడా విభాగంలో సెలక్షన్ ట్రయల్స్ ఫిజికల్ అండ్ టెక్నికల్ స్కిల్ టెస్ట్‌లను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్‌లు, బోర్డ్ ఆఫ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. దరఖాస్తుదారుడి వయస్సు 8 నుంచి 14 సంవత్సరాల మధ్య ఉండాలి. (2010 జూన్ 9 నుంచి 2016 జూన్ 10)లోపు జన్మించిన వారై, కనీసం 2వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఎంపిక సమయంలో మెడికల్ ఆఫీసర్, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ ద్వారా మెడికల్ ఫిట్‌నెస్‌ను నిర్ధారిస్తారు. శరీరంలో ఏ భాగంలోనైనా శాశ్వత టాటూ ఉన్న అభ్యర్థులు ర్యాలీలో పాల్గొనడానికి అనర్హులు. అర్హత గల అభ్యర్థులు ది బ్లాక్ బ్రిడ్జ్, ది మద్రాస్ రెజిమెంటల్ సెంటర్, వెల్లింగ్టన్(నీలగిరి)లో జూన్ 10వ తేదీ ఉదయం 7 నుంచి 12 గంటల వరకు రిపోర్ట్ చేయవచ్చు. వివరాల కోసం 8848545629, 9790808233 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

22న చిత్రలేఖనం పోటీలు

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు పర్యావరణ, సామాజిక శాస్త్రవేత్త ప్రసన్నకుమార్ తెలిపారు. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో సనత్‌నగర్‌లోని టీఎస్ పీసీబీ కార్యాలయంలో పోటీలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో సినిమా థియేటర్లు ఓపెన్

చిక్కడపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో సినిమా థియేటర్లు తెరిచే ఉంటాయని, ఏదో ఒక సినిమా నడిపిస్తామని తెలంగాణ ఫిలిం ఎగ్జిబిటర్ల సంఘం సభ్యుడు బాల్‌గోవింద్‌రాజ్ తెలిపారు. సినిమాలు రాకపోవడం వల్ల సింగిల్ స్క్రీన్ థియేటర్లు కొన్ని రోజులు మూతపడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. కొత్త సినిమాలు వస్తే మళ్లీ తెరుస్తారని తెలిపారు.

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు ఉచిత స్కాలర్‌షిప్ టెస్ట్

బర్కత్‌పుర, మే 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ (నిఫ్డ్) ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్న ఫ్యాషన్ డిజైనింగ్‌లో డిప్లొమా కోర్సులలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కన్నెబోయిన రాముయాదవ్ తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులలో చేరేందుకు ఈ నెల 19వ తేదీన కొత్తపేటలోని నిఫ్డ్ సంస్థలో ఉచిత స్కాలర్‌షిప్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గురువారం బర్కత్‌పురలో సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆసక్తి గల మహిళలు, యువతులు, విద్యార్థినులు ఈ నెల 18వ తేదీలోపు ఉచిత స్కాలర్ షిప్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9030610033, 9030610055 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

కారును ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

బేగంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): బేగంపేట ఫ్లైఓవర్‌పై ఓ కారు ప్రమాదానికి గురై రోడ్డుకు అడ్డంగా తిరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బేగంపేట ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం 8 గంటల సమయంలో అమీర్‌పేట నుంచి బేగంపేట వెళ్తున్న కారును వెనుక నుంచి వస్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో కారు రోడ్డుకు అడ్డంగా తిరిగింది. కారు ముందుభాగం స్వల్పంగా ధ్వంసమైంది. కారు రోడ్డుకు అడ్డంగా తిరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనదారులు డయల్ 100కు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గురైన కారును క్రేన్ ద్వారా తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.